ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

భిక్కనూరులో 1729 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

దేశాయిపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో అంకెలను సూచిస్తూ ముగ్గులు వేసిన విద్యార్థులు

బాన్సువాడలో ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఈవో నాగేశ్వర్ రావు

అక్కాపూర్ పాఠశాలలో..

పెద్ద కొడప్‌గల్ గురుకుల పాఠశాలలో ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయుడు

కామారెడ్డి/బాన్సువాడ రూరల్/బాన్సువాడ టౌన్/ నస్రుల్లాబాద్/మాచారెడ్డి/పెద్ద కొడప్‌గల్/ భిక్కనూరు/ కామారెడ్డి రూరల్/రాజపేట, డిసెంబర్ 22 : గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామనుజన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లోని పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామనుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గులు, ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కామారెడ్డిలోని ఆర్కిడ్స్ పాఠశాలలో విద్యార్థులు గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్, తాడ్కోల్, కోనాపూర్, బోర్లం ఉన్నత పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. దేశాయిపేట్ ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాన్సువాడలోని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గణిత శాస్త్ర ప్రదర్శనను బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావు పరిశీలించారు. బాన్సువాడ రూరల్, బాన్సువాడ ప్రభుత్వ పాఠశాల, కొయ్యగుట్ట బాలికల గురుకుల పాఠశాల, నస్రుల్లాబాద్‌లోని వెంకటసాయి పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ పాఠశాలలో రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గణితశాస్త్ర ఉపాధ్యాయులు శివప్రసాద్, నాగరాణిలను గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. పెద్దకొడప్‌గల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శ్రీనివాస రామానుజన్ చిత్ర పటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను చూసి అభినందించారు. భిక్కనూరులోని శ్రీచైతన్య విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కామారెడ్డి మండలం క్యాసంపల్లిలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవం కార్యక్రమంలో మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజపేట మండలం తలమడ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కంకరరాళ్లను వివిధ రంగుల్లో ముంచి రామానుజన్ చిత్రపటాన్ని గీశారు.

నస్రుల్లాబాద్‌లో..

భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహప్రతిష్ఠాపనోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

రుద్రూర్/కోటగిరి, డిసెంబర్ 22 : రుద్రూర్ మండలంలోని రాణంపల్లిలో సంజీవని హనుమాన్ ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడురోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వివిధ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆలయాన్ని ప్రారంభించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో బాన్సువాడ నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి రూ.150 కోట్లు ఇచ్చామని తెలిపారు. సంజీవని ఆంజనేయస్వామి ఆలయానికి రూ.40 లక్షలు, సన్నిధానానికి రూ.10 లక్షలు మంజూరుచేసినట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ అక్కపల్లి సుజాతానాగేందర్, సర్పంచ్ దయాల రోజాలక్ష్మణ్, ఆలయ కమిటీ చైర్మన్ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, కార్యదర్శి బాలరాజు, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు. కోటగిరి మండలం కల్లూర్‌కు చెందిన మాజీ సర్పంచ్, పొతంగల్ సహకార సంఘం అధ్యక్షుడు నరేంద్రరెడ్డి శుక్రవారం మృతిచెందాడు. నరేంద్రరెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి నివాళులర్పించి కంటతడిపెట్టారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆందోళన వద్దు.. 'డబుల్' బిల్లులు వస్తాయి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 22 : డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం నుంచి బిల్లులు అందేలా చూస్తామని బాన్సువాడ పంచాయతీరాజ్ శాఖ ఈఈ ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. బిల్లులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రూరల్ ఏరియాలో ఇండ్లు నిర్మించుకునే వారికి రూ. 5 లక్షల 4వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 5లక్షల 30 వేలు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. రూరల్ ప్రాంతాల్లో 2022 జూలైకి ముందు మంజూరైన ఇండ్లకు అన్ని రకాల పన్నులు పోను రూ.4లక్షల 25 వేల 87 అందుతుందని, అనంతరం మంజూరైన వారికి రూ. 4లక్షల 24వేల 08 అందుతుందని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో 2022 జూలైకి ముందు మంజూరైన ఇండ్లకు ట్యాక్సులు పోను రూ. 4లక్షల 41వేల 940, అనంతరం మంజూరైనవారికి రూ. 4లక్షల 18వేల 083 అందుతాయన్నారు. ఇందులో ఎఫ్ఎస్‌డీ సుమారు రూ. 10వేల 600 ఫైనల్ బిల్ వచ్చిన తరువాత రెండేండ్లకు లబ్ధిదారులకు తిరిగి వస్తుందని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే పీఆర్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

నేడు వైకుంఠ ఏకాదశి

కామారెడ్డి, డిసెంబర్ 22 : జిల్లా కేంద్రంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయం, గోపాల్ స్వామి రోడ్‌లోని గోపాల్‌స్వామి ఆలయాలు, మిగిలిన వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. ఆలయాలకు సున్నం వేసి, రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

కామారెడ్డిలో ముస్తాబైన ఆలయం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 22 : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని చిన్నమల్లారెడ్డిలో ఉన్న చైతన్య విద్యానికేతన్ హైస్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి నితిన్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు అనిల్ కుమార్ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు ఆనంద రావు కోరారు.

పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడం సిగ్గుచేటు

మాట్లాడుతున్న కైలాస్ శ్రీనివాస్‌రావు

కామారెడ్డి, డిసెంబర్ 22 : పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల, ఇండియా కూటమి ఎంపీలను అకారణంగా పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజలచేత ఎన్నుకోబడిన పార్లమెంట్ సభ్యులను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వామపక్ష పార్టీ నాయకుల నిరసన

వామపక్ష పార్టీల పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల పార్టీల నాయకులు శుక్రవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్, ప్రకాశ్, జబ్బర్, మోతీరాం నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరుకు తోట దగ్ధం

రాజంపేట్, డిసెంబర్ 22 : మండల కేంద్రానికి చెందిన తోట నారాయణ తన మూడు ఎకరాల 15 గుంటల్లో చెరుకు సాగు చేస్తున్నాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు చెరుకు తోట కాలిపోయింది. తోటతోపాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు బాధిత రైతు సమాచారం అందించాడు. తోట కాలిపోవడంతో ఆర్థిక నష్టం సంభవించిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

దివ్యాంగులు ప్రభుత్వ ఆసరాను వినియోగించుకోవాలి

బ్రెయిలీ కిట్ల పంపిణీలో ఎంఈవో వెంకటేశం

దివ్యాంగులకు బ్రెయిలీ కిట్లను అందజేస్తున్న ఎంఈవో వెంకటేశం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: జీవితంలో సమస్యలను అధిగమించి మంచిగా బతకడానికి ప్రభుత్వ ఆసరాను వినియోగించుకోవాలని ఎంఈవో వెంకటేశం అన్నారు. ఎల్లారెడ్డిలోని విద్యా వనరుల కార్యాలయంలో అంధత్వం ఉన్న ఇద్దరు పిల్లలకు ఆయన శుక్రవారం బ్రెయిలీ కిట్లను అందజేశారు. సహిత విద్యలో భాగంగా సమగ్ర శిక్ష, అలీం కో సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డిలో సెప్టెంబర్‌లో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అందులో భాగంగా ఎల్లారెడ్డి మండలానికి చెందిన ఇద్దరికి బ్రెయిలీ కిట్లు మంజూరయ్యాయని, వాటిని అందజేసినట్లు ఎంఈవో తెలిపారు. ఐఈఆర్పీలు వెంకటేశం, శివకుమార్ అప్ప, ఎమ్మార్పీ సిబ్బంది అశోక్, కాశీరాం, లక్ష్మణ్, దివ్యాంగ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడిబయటి పిల్లల గుర్తింపు

వడ్డెపల్లిలో బడీడు పిల్లలను గుర్తించిన విద్యాశాఖ అధికారులు

నిజాంసాగర్/ ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: నిజాంసాగర్ మండలంలోని వొడ్డెపల్లి గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద పని చేస్తున్న కార్మికుల పిల్లలు ఎనిమిది మంది బడికి వెళ్లని విషయం తెలుసుకున్న సీఆర్పీ శ్రీధర్‌కుమార్, నర్సింహులు శుక్రవారం వారి వద్దకు వెళ్లారు. ముగ్గురు పిల్లలు 4వ తరగతి మధ్యలోనే ఆపివేయగా.. మరో నలుగురు పిల్లలు అసలే పాఠశాలకు వెళ్లలేదని గుర్తించారు. దీంతో వారి తల్లిదండ్రులతో మాట్లాడి, పిల్లలను బడులను పంపించేలా కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వారి వెంట ఐఈఆర్టీలు సునీల్, సాయిలు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి మండలం మౌలాన్‌ఖేడ్ గ్రామంలోని ఇటుకబట్టీల వద్ద ఆరుగురు బడిబయటి పిల్లలను సీఆర్పీ మహేశ్ శుక్రవారం గుర్తించారు. వారి కుటుంబసభ్యులకు చదువు ప్రాధాన్యతను వివరించారు. ఆర్థిక సమస్యలు చదువుకు అడ్డంకిగా మారొద్దని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, పిల్లలను తప్పకుండా బడికి పంపాలని సూచించారు. కార్యక్రమంలో మౌలాన్‌ఖేడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముజీబుద్దీన్, పిల్లలు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

బిచ్కుంద, డిసెంబర్ 22: మండలంలోని పుల్కల్ గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని ఉన్నతాధికారులకు అప్పగించామని చెప్పారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

డోంగ్లీ, డిసెంబర్ 22: మండలంలోని మొఘ గ్రామంలో క్రీడాకారులకు సర్పంచ్ సూర్యకాంత్ పాటిల్ స్పోర్ట్స్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యం సాధ్యమని, మానసికోల్లాసం కలుగుతుందని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శెట్టివార్ దిలీప్, రాజు పాటిల్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పిట్లం, డిసెంబర్ 22: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణుడు హరి కిషన్‌రావు 65 మందిని పరీక్షించారు. వారిలో 21 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి, ఆపరేషన్ నిమిత్తం బోధన్‌లోని లయన్స్ కంటి దవాఖానకు ప్రత్యేక వాహనంలో పంపించారు. లయన్స్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, వేణుగోపాల్, వైద్యాధికారులు శివకుమార్, పూజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రామారెడ్డి, డిసెంబర్ 22: మండల కేంద్రానికి చెందిన బోదాసు స్వప్న కనిపించడం లేదని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వప్న గురువారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువులు, తెలిసిన వారి ఇండ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి చిన్నరాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ

పిట్లం, డిసెంబర్ 22: మండలకేంద్రంలోని భవిత కేంద్రంలో శుక్రవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. ఎంఈవో దేవీసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యాధికారిణి విశాలాక్షి 14 మంది దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. దివ్యాంగులతో ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాలపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు కమల్‌కిశోర్, గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక

శ్రావ్యారెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివనగర్, డిసెంబర్ 22: కుప్రియాల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శ్రావ్యారెడ్డి జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి శుక్రవారం తెలిపారు. నిజామాబాద్‌లో ఇటీవల నిర్వహించిన అండర్-17 బాలికల ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. దీంతో కర్ణాటక రాష్ట్రంలోని మాడికేర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా శ్యావ్యా రెడ్డిని ఎంజేపీ రాష్ట్ర సెక్రటరీ మల్లయ్య బట్టు, ఆర్సీవో సత్యనాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాగిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

యూత్ ఎక్స్ఛేంజ్ క్యాంప్‌నకు పిట్లం విద్యార్థులు

క్యాంప్‌నకు ఎంపికైన విద్యార్థులు

పిట్లం, డిసెంబర్ 22: పంజాబ్‌లో నిర్వహించే జాతీయ యూత్ ఎక్స్ఛేంజ్ క్యాంప్‌నకు పిట్లం విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యుడు సంజీవ్ రెడ్డి శుక్రవారం పంజాబ్‌కు పంపించారు. పంజాబ్ రాష్ట్రంలోని మొగలో నిర్వహించే శిబిరంలో వారు పాల్గొంటారని సంజీవ్‌రెడ్డి తెలిపారు. వారి వెంట ఉపాధ్యాయుడు మంగళం ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 22: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని ఎల్లారెడ్డి ఎంపీపీ కర్రె మాధవీ బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని మత్తమాల పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాపూర్ అంగన్‌వాడీ కేందాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మత్తమాల పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. దవాఖానకు వచ్చిన వారితో మర్యాదగా ప్రవర్తించి, మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యుడితోపాటు సిబ్బందికి సూచించారు. పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులను పరిశీలించారు.

భూ నిర్వాసితులతో సమావేశం

కొమలంచ గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

నిజాంసాగర్, డిసెంబర్ 22: మండలంలోని మంజీర పరీవాహక ప్రాంతంలో రూ.476 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నాగమడుగు మత్తడి నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. నాగమడుగు మత్తడిని జక్కాపూర్-వొడ్డెపల్లి-కొమలంచ గ్రామాల శివారులో నిర్మిస్తున్నారు. కొమలంచ గ్రామానికి చెందిన భూ నిర్వాసితులు, రైతులతో శుక్రవారం అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో భుజంగరావు, నీటి పారుదల శాఖ ఈఈ సోలోమాన్‌తోపాటు అధికారుల బృందం పాల్గొన్నారు. ప్రభుత్వం భూములు కొల్పోయిన రైతులకు ఎకరాకు ఎంత పరిహారం చెల్లిస్తున్నారు..? ఎన్ని ఎకరాల భూమి అవసరం ఉన్నది..? అనే విషయాలపై పట్టాదారులతో మాట్లాడారు. మత్తడి నిర్మాణ విషయంలో రైతులు కొంత గందరగోళానికి గురి కావడంతో వారితో మాట్లాడి సమస్యలన్నింటినీ పరిష్కరించారు. సమావేశంలో సర్పంచ్ అనురాధ, తహసీల్దార్ భిక్షపతి, డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, గిర్దావర్ అంజయ్య, సర్వేయర్లు శ్రీకాంత్, వెంకటితోపాటు నీటి పారుదల శాఖ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314374

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఉదయ్‌కిరణ్ ఎంపిక

గాంధారి, డిసెంబర్ 22: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలకు మండలంలోని బామన్‌నాయక్ ఫౌండేషన్ క్రీడాకారుడు ఉదయ్ కిరణ్ ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్ శుక్రవారం తెలిపారు. కామారెడ్డిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న ఉదయ్‌కిరణ్ గత నెల 28న తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీలో నేడు(శనివారం), రేపు(ఆదివారం) జరగనున్న పోటీల్లో తెలంగాణ యూనివర్సిటీ జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని బామన్ నాయక్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు గుగ్లోత్ సురేందర్, చైర్మన్ సేవంత రాథోడ్ అభినందించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బాలచందర్

నిజాంసాగర్, డిసెంబర్ 22: వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని మోటివేషన్ ట్రైనర్, కొమలంచ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలచందర్ అన్నారు. నిజాంసాగర్ మండలంలోని మల్లూర్ ఉన్నత పాఠశాల, మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సులను వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సులభమైన మార్గాలను అనుసరించి బోధన, మెళకువలు, పరీక్ష రాసే విధానాన్ని వివరించారు. జీవితంలో ఎదుగుదల, స్వయం సమృద్ధి, మానసిక వికాసం, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవడం కోసం చేయాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో మహ్మద్‌నగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రాజు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణ మందిరంలో గీతా జయంతి

లింగంపల్లిలోని శ్రీకృష్ణ మందిరం

సదాశివనగర్, డిసెంబర్ 22: మండలంలోని లింగంపల్లి గ్రామంలో ఉన్న శ్రీ కృష్ణ మందిరంలో శనివారం గీతా జయంతి, దత్త జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు బాబాలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7 గంటలకు సామూహిక గీతా పారాయణం, 8 గంటలకు అభిషేకం, 9 గంటలకు ధ్వజారోహణం, 10 గంటలకు గీతా శ్లోకాల పఠనం, 12 గంటలకు సామూహిక హారతి, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అన్నదానం, సామూహిక భజనలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్సవాలకు రావాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిర్వాహకులు